# దత్తపుత్రుడు

ఆయిదేళ్ళ వాడప్పుడు ప్రసాదరావును తెచ్చి పెంచుకున్నది సుబ్బమ్మ గారు. వాడికి లక్ష్మీనారాయణశాస్త్రి అని తన భర్తగారి పేరే పెట్టించుకుని, ఆపేరుపెట్టి పిలిచేయోగ్యత తనకు లేదుగనక 'ప్రసాదం' అనే పిలిచేది.

తన దత్తత నిశ్చయమైన కొత్తలో ప్రసాదం (లేక, శాస్త్రి) తనకేదో జరగబోతున్నదని మాత్రమే తెలుసుకోగలిగాడు గాని, అది ఏమిటో గ్రహించలేక పోయినాడు. తనకు నిజంగా ఏదైనా విపత్తే జరగబోతుంటే ఎవరో ఒకరు తనకోసం ఆదుర్దాపడరా? ఏ విపత్తూ లేకపోతే, తన తల్లి మొహం ముడుచుకొని సహం కాపటానికి కారణం ఏమిటి?...ఆరాత్రి - ఒక రాత్రివేళ ఆవిడ తన పక్కలోవచ్చి ఎందుకు పడుకున్నది? తనమొహం ఎందుకు అన్నిసార్లు ముద్దుపెట్టుకొన్నది? ఆవిడమొహం తన మొహానికి తడిగా ఎందుకు తగిలింది?

తన తల్లిచేసిన ఆపనికి ఆ అర్భకుడికి ఆనందంకలిగే అవకాశం కూడా ఎక్కడ? ఒకవేపునించి అర్థంకాని భయం ఆవరించు కొచ్చిందేగాని!

ఆతరువాత, వెంటనే కొద్దిరోజుల్లో దత్తత చేశారు. తనకు కొత్త తల్లి వచ్చింది. ఆవిడకు జుట్టులేదు, బొట్టులేదు. ఇకముందు ఆవిడ తనకు అమ్మ! వెధవముండ అయిన అమ్మను ప్రసాదం ఊహించుకో లేక పోయినాడు. వాడి కది చెప్పరానంత అశుభంగా తోచింది.

దత్తత జరుగుతుంటే, వాడు ఎవరికేసీ చూడలేక పోయినాడు. అవమానమూ, రోషమూ, దుఃఖమూ, నిరాశా, ఇంకేమేమిటో వాడి చిన్న హృదయాన్ని మథించేస్తున్నై. వాడి కళ్ళు మంత్రాలు చదివే బ్రాహ్మణ్ణి గురించి, అత్రంగా అనవసరమైన వివరాలన్నీ గమనిస్తున్నై.

ఆయన పెదిమలు ఎట్లా కదిలేదీ, ఆయన మెడమీది చర్మమూ పీకా ఎట్లా పైకీ కిందికీ ఆడుతున్నదీ, మంత్రాలు చదవటంలో గుక్కతీసుకునేటప్పుడు ఆయన కనుబొమ్మలు ఏవిధంగా పైకెత్తేదీ గమనిస్తున్నాడు. తనవెనక, సమీపంలోనే కూర్చున్న తన అమ్మ — ఆ వెధవముండ గుండు ముసుగుకాదు! — "అమ్మ" మొహం ఎట్లావున్నదీ, చూడకుండానే వాడికి కనిపిస్తున్నది.

దత్తత అయిపోగానే "అమ్మ" కంటనీరు పెట్టుకున్నది. తనకూ్కడా బావురుమని ఏడుపొచ్చింది. ప్రసాదం ఏడిచాడు.

"పిల్లవాణ్ణి కాస్సేపు అట్లా దొడ్లోకి తీసుకుపోయి సముదాయించవమ్మా!" అని ఒక మగగొంతు — నలభైఏళ్ళ నెరసినగడ్డం గొంతు— కేకపెట్టింది.

"నాన్నగారూ! ఏడువకు. అట్లా ఏడుస్తారా ఎక్కడన్నా?" అన్నది అమ్మ.

"మరి నువ్వేడవ లేదుటే?" అన్నాడు ప్రసాదం.

"మిగిలిన నలుగురు పిల్లలులేందీ, నువ్వు నన్ను 'ఏమే' అని పిలవటంకూడా ఎందుకు నేర్చుకున్నావురా నాన్నా? నీమాటలు జ్ఞాపకం వస్తే నే నేమయేదిరా?" అని ఆవిడ మళ్ళీ రోదనం మొదలుపెట్టింది. ప్రసాదానికీ ఏడుపొచ్చింది.

ఇంతలో ముంచుకుపోటునట్టుగా వచ్చింది ఆ ముసుగు గుండు వెధవముండ — "పిల్లవా డేడుస్తున్నాడుటమ్మా, పాపం...." అంటూ.

దూరాన్నించి ఒక గర్జన వినబడింది — "వ్వొసే, సుబ్బ....మ్మా" గడ్డం నెరిసిన నలభైఏళ్ళ గొంతు.

"ఓ ఓ ఓయ్!" అన్నది ముసుగు వెధవముండ గుండు.

"న్వ్‌ట్‌రా!" — నెరసిన వీభూది నలభైఏళ్ళ రుద్రాక్షలు. బలవంతాన గుండు రుద్రాక్షల మాటప్రకారం నడుచుకుంటూ వెళ్ళింది.

"అమ్మా, నాకు వాళ్ళ ఆస్తి ఒద్దే!" అన్నాడు ప్రసాదం ఏడుపు గొంతుతో. తల్లి సమాధానంకోసం ఊపిరి బిగబట్టి చెవులు రిక్కించిన దేవతలకేమీ వినిపించలేదు.

*     *     *

"అబ్బాయి, ప్రసాదం!....ఇక్కడవుండే పలకవేంరా నాయనా?"

"ఎందుకేం?"

"అన్నం తినవుట్రా?"

"నా కాకల్లేదు ఫో!"

"నన్నెందుకురా, నాయనా, ఇట్లా ఏడిపిస్తావ్?"

"నువు మా అమ్మ నేడిపించలేదేం? ఆవిడకన్న నువ్వెక్కువేడుస్తున్నావా?"

"హయ్యో తండ్రీ! ఏడవదూ, పాపం! కన్నకడుపు కాదూ? నిన్నెప్పుడు పెంపుడివ్వటానికి వొప్పుకుందో అప్పుడే ఆవిడ కడుపు కోసుకుంది."

"నువు పెంపుడడిగితే ఇచ్చింది. లేకపోతే ఇస్తుందా ఏమిటి?"

"అడిగితేమాత్రం ఇస్తారుట్రా నాయనా! ఇంకా ఇద్దరు కొడుకులూ, ఓ కూతురూ ఉన్నారు గనక ఇచ్చింది. లేకపోతే ఇస్తుందా?"

"మరి నాకోసం ఏడవటం మానేసిందా?"

"మానకుండావుందా ఏమిటి? ఏడిచి ఏడిచి మానేసుంటుంది."

"మా అమ్మ నాకోసం రోజూ ఏడుస్తుంది."

"నేనుమాత్రం మీ అమ్మను కాదుట్రా నాయనా!"

"నువు మా అమ్మ వెందు కవుతావేమిటి? మా అమ్మను నేను 'ఏమే' అనేవాణ్ణి. అందుకని నాకోసం ఏడుస్తుంది."

"నన్నుకూడా 'ఏమే' అనరా!"

"మా అమ్మ నా దగ్గర పడుకుని ముద్దుపెట్టుకునేది."

"మరి, నే ముద్దుపెట్టుకోబోతే తోసేస్తా వెందుకురా నాయనా?

"నువ్వా! నీదగ్గర వెధవముండ వాసన! నువ్వేమన్నా మా అమ్మవా ఏమిటి, నన్ను ముద్దుపెట్టుకోటానికి?"

"నేను మీ అమ్మల్లే ఏడువటంలా? చూడూ!"

"అన్నీ దొంగ ఏడుపులు!...నాతో అవీ ఇవీ చెప్పుతూ కూర్చుని అన్నం పెట్టవేం?"

"ఇదుగో ఒక్కక్షణం!"

"నాకు పెరుగ్గావాలి. ఉందా?"

"అయ్యో! నీకు పెరుగులేకుండా చేస్తానుట్రా?"

"నిన్ను 'అమ్మా' అని పిలవటానికి లంచమేం?"

"నీ కిష్టంలేకపోతే పిలువకమ్మా! 'అమ్మా' అని పిలువక పోయినా పెరుగేస్తాగా! నీకు కాకుండా నే నింకెవరికి పెట్టుకుంటాను చెప్పు!"

"మా అమ్మను చూడాలి, మా అమ్మదగ్గిర పడుకోవాలి, మా అమ్మ నన్ను ముద్దుపెట్టుకోవాలి, నా కన్నంపెట్టాలి, మా అమ్మ నాకు నీళ్లు పొయ్యాలి, మా అమ్మను రమ్మను, లేకపోతే నేను బడికిపోను, అన్నం తినను, నీళ్లు పోసుకోను, ఏమీ చెయ్యను."

"మీ అమ్మ. పాపం, ఇక్కడికివచ్చి కూచోమంటే కూచోగలదా? నువ్వే వెళుదువుగాని."

"అన్నీ వొట్టిదే! నువు పంపిస్తావా నిజంగా?"

"పంపించకపోతే అప్పుడను."

"చూద్దాంగా!"

* * *

తన తల్లి కనపడగానే ప్రసాదం తల్లి కేసి చేతులుచాచి "నే నొచ్చానే అమ్మా!" అన్నాడు. తల్లి పెద్ద కేకవేసి కొడుకుని ఆలింగనంచేసి, మొహమంతా నిమిరి, "ఒచ్చావుట్రా, నాన్నా? నా చిట్టితండ్రే! నా బంగారుతండ్రే! మా నాయనే! మా వరహాలే!" అని ప్రేమ కురిపించ సాగింది.

"నన్ను పంపించకపోతే అన్నం తిన్ననన్నానే! బడికి పోనన్నానే! నీళ్లు పోసుకో నన్నానే!"

తల్లి ముక్కుమీద వేలుపెట్టుకొని గుడ్లు తేలవేసి కొడుక్కేసి చూస్తూ "అయ్యయ్యో! అట్లా అనొచ్చునట్రా, పిచ్చివెధవా!" అన్నది.

"ఏమే!" అన్నాడు ప్రసాదం, నిర్లక్ష్యంగా తల ఆడిస్తూ.

"ఆవిడ ఏమన్నా అనుకోదూ?"

"ఏ మనుకొంటే?" ఇంకా నిర్లక్ష్యంగా.

"ఆవిడ కోపం రాదుట్రా? పైకట్లా అనొచ్చా?"

"ఆ వెధవముండ కోపంవస్తే నాకుభయమా ఏమిటి?" అన్నాడు ప్రసాదం తన తల్లి బెదురు కాశ్చర్యపడుతూ.

తనకొడుకు ప్రయోజకత్వానికి కలిగిన ఆనందాన్ని లోపలే అణుచు కోటానికి ఆడది చెయ్యగలిగినంత ప్రయత్నంచేస్తూ, నోటిమీద చెయ్యి కొట్టుకుంటూ "అవ్వ! అవ్వ! అట్లా అనొచ్చుట్రా? ఆవిడకు తెలిస్తే ఏమంటుందీ?" అన్నది.

"ఏమంటుందేం? నేను రోజూ ఆవిణ్ణి అంటంలా?"

"ఏమనీ?"

"వెధవముండా అని"

తల్లి కొడుకువంక సోద్దెంగాచూస్తూ "ఆ మాటంటే ఊరు కుంటుందీ?" అన్నది.

"ఎందు కూరుకోదూ ?"

"నువ్వట్లా అన్నా, నిన్నుఆపేక్షగా చూస్తుందిట్రా?" అన్నదితల్లి.

"పెరుగేసి పెడుతుంది."

* * *

రాత్రివేళ భోంచేసి ప్రసాదం పడుకున్నాడు. ఇక్కడి మంచాలూ పక్కలూ అక్కడంత బాగాలేవు. లేకపోతే ఏం? ఇది అమ్మ వేసిన పక్క. ఇవాళ మళ్ళీ ఒక రాత్రివేళ అమ్మవచ్చి తన పక్కలో పడుకుని అదివరకల్లేనే ముద్దు పెట్టుకుంటుంది. కాని ఏడవదు. ఇంకెందు కేడవడం? తన పెంపు డయిపోయిందిగా!....అమ్మ వచ్చి తన దగ్గిర పడుకునేదాకా తను మేలుకునే ఉండాలి...తను వచ్చిన సంతోషం పొద్దున అమ్మ ఎంత బాగా కనపరిచింది. మళ్లా రోజల్లా కనబరచలేదు. కాని, లోపల ఉంటుంది!

అమ్మా, నాన్నా జాముసేపటినుంచి మాట్లాడుకుంటున్నారు. తనకేమీ అర్థం కాదు. వాళ్ల మాట్లాడేది తన్నుగురించే.

"ఆవిడకి వాడంటే చాలా ఆపేక్షగా ఉన్నట్టుంది. అదీ కొంత నయమే! వాణ్ణి మనిష్టం వచ్చినప్పుడల్లా తెచ్చుకోవచ్చు....ఆవిణ్ణి కొంత డబ్బేమయినా అడుగుతారా ఏమిటి ?" అంటున్నది అమ్మ.

"ఏదో చూద్దాంలే." అని విసుక్కుంటున్నాడు నాన్న.

* * *

నెల రోజులయినా సుబ్బమ్మ కుర్రవాడికోసం కబురు చేయదు. పది రోజులనించీ ప్రసాదం తల్లిదండ్రుల ఆదుర్దా హెచ్చుతున్నది.

ఆవిడ పిల్లాణ్ణి విడిచి పెట్టేసి, ఇంకోణ్ణి పెంచుకుంటుందేమో!

వీడు ఆవిడకేం కోపం తెప్పించాడో ఏం ఖర్మమో!

కాకపోయినా, ఆవిడమీద ఈ వెధవకింత అలుసెట్లా వచ్చిందో! ఎవర్నీ తొందరపడి ఏమాటా అనేవాడు కాడే!...

చాటుగా అమ్మ అబ్బాయిని కసిరింది – "నువ్వావిణ్ణి ఏమన్నావురా వెధవా?"

"వెధవముండా అన్నాను."

"ఎన్నిసార్లన్నావు ?"

"ఏమో ! చాలాసార్లన్నాను. ప్రతిరోజూ అన్నాను. ఆవిడ వెధవ ముండ కాదాఏమిటి? ఆవిడ దగ్గిర వెధవముండ వాసన కూడానూ!"

తనని గద్దించే తల్లినీ, అదివరకు ఆనాడు తనని దొడ్లోకి తీసుకు వచ్చి ఏడ్చిన తల్లినీ ఒకతెగా భావించలేక పోయినాడు ప్రసాదం. ఆడ దాని అఘాయిత్యం వాడికేం తెలుసు ! ఆనాడు తనని ఏడిపించడమే ఆవిడ ఆశయ మని వాడేమెరుగునూ ?

* * *

"మా వాడు పట్టి వదరుబోతు. వాడు అందర్నీ తిట్టటంకూడా నేర్చు కున్నాడు." అన్నాడు అబ్బాయి జనకతండ్రి.

"అందర్నీ ఎందుకు తిడతాడు పాపం ? నన్నే తిడతాడు. వాడి చేత తిట్టించుకోవటం నాకు ముద్దే! నేను వాడికా అలుసిచ్చాను." అన్నది సుబ్బమ్మగారు.

జనకతండ్రి అతి దీర్ఘ నిశ్వాసం విడిచాడు. అంతగాలీ ఆయనలో ఉండి రకరకాల హృదయ మనోవికారాలు కలిగిస్తూ ఉంచింది. ఆ విష వాయువు బయటికి పోగానే ఆయన మొహంలో కొత్త కళ వచ్చింది.

"వాడు తల్లికోసం, పాపం, కలవరించసాగాడు. అందుకని పంపించాను. వాడి సుఖమే నాక్కావలిసింది." అన్నది సుబ్బమ్మకూడా నిట్టూర్చి.

"బాగుందే! ఇక మీరే వాడితల్లీ! మీరు కాస్త వాణ్ణి భయపెట్టండి, లేకపోతే చెడతాడు!"

*　　*　　*

"ప్రసాదం ?"

"ఏవమ్మా ?"

"పడుకోవుట్రా, నాయనా ?"

"పడుకుంటాన్లేవే !"

"నా పిచ్చితండ్రిగదే, నన్నేవే అన్నావుటే! ఏదీ ఒక ముద్దు పెట్టు! ఆరి దొంగముండా. నీ ముద్దెంత కమ్మగా ఉందిరా!....నా దగ్గిర వెధవముండ వాసనెయ్యటం లేదమ్మా!"

ప్రసాదం బిక్కమొహం వేశాడు.

"నాతండ్రి లేదులేరా !" అని సుబ్బమ్మ కుర్రాణ్ణి తన రొమ్మున అదుముకున్నది.